


# వ్యాధి

**28** జులై 2006 శుక్రవారం, మేరీల్యాండ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా.

రాత్రి పదిగంటల పద్దెనిమిది నిమిషాలు...

అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తు కిటికీలోనుండి బయటికి ...చిమ్మ చీకటిని...కుండపోత వర్షంలోకి తదేకంగా చూస్తున్నాడు రిటైర్ట్ ప్రొఫెసర్ మాధవ్

ఒకటే ఎడతెగని వర్షం...వర్షంలో తడుస్తూ ఎదురుగా ఇంటర్ స్టేట్ ఎక్స్‌ప్రెస్ పైన విపరీతమైన సౌండ్ చేస్తూ కనీసం డెబ్బయి మైళ్ల వేగంతో పరుగెడుతున్న కార్ల మందలు...పన్నెండు ట్రాక్‌లున్న రోడ్‌పై ఆరు ట్రాక్‌ల్లో అటు వెళ్తూన్న కార్ల ఎర్రని టెయిల్ ల్యాంప్స్...నిప్పుల ప్రవాహం వలె..పక్కనున్న ఆరు ట్రాక్‌ల్లో ఎదురుగా వస్తున్న కార్ల హెడ్‌ల్యాంప్స్ వెలుగు ఒక కాంతినది వలె..అన్నింటి పైనా కుంభవృష్టిగా

వర్షం..అతివేగంగా తిరుగుతున్న టైర్ల క్రింద నీరు నలిగి ఆవిరై పొగవలె పైకి ఎగసి రోడ్డుపైన ఒక మీటర్ ఎత్తు వరకూ హిమధూళి...దృశ్యంపై మరణమృదంగం వలె భీకరమైన ట్యూబ్‌లెస్ టైర్ల ఎడతెగని చప్పుడు...

ఇంతమంది...ఇంతరాత్రి...ఇంతవేగంగా...వెనుకనుండి ఎవరో తరుముతున్నట్టు...ఎక్కడికి వెళ్తున్నారు వీళ్లు...ఎక్కడినుండి వస్తున్నారు వీళ్లు...

పని..పని...ఎడతెగని పని...ఎడతెరిపిలేని పరుగు..ఎడతెగని సంపాదన..వేట...డాలర్లవేట...బ్యాంక్ బ్యాలెన్స్‌లు...వన్ డాలర్ ఈజ్ ఈక్వల్ టు ఫార్టీ సిక్స్ రూపీస్...డిఫాల్ట్‌లో మల్టిప్లికేషన్ ఫాక్టర్..డాలర్ల కోసం వలస... వలసలన్నీ డాలర్ వేటలే...ఒకన్ని చూసి ఒకరు..వాన్ని చూసి ఇంకొకరు.. హెచ్‌వన్ వీసాల పరుగులు...మేధో వలసలు.. బంధాలను తెంపుకుని అనంతమైన సంపాదన కోసం, సుఖాలకోసం, స్టేటస్ కోసం ఇంకా ఇంకా మనిషికి ఏమి కావాలో తెలియక...తెలిసినవన్నీ సత్యాలు కావని తెలియక వలసలు...

కార్ల రొద...అనంత ప్రవాహం..ఒకటే వర్షం...అన్నింటినీ గాఢాలింగనం చేసుకుని చీకటి.

మాధవ్‌కు నిన్న సాయంత్రం యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ తాలూకు భాషాశాస్త్ర విభాగం వాళ్ళు, స్థానిక తెలుగు సంఘం వాళ్ళు సంయుక్తంగా తన గౌరవార్థం ఏర్పాటు చేసిన అతిథి ప్రసంగం గుర్తుకొచ్చింది. ప్రొఫెసర్ బ్రూక్స్, ఆచార్య సుధాకర్‌రెడ్డి మాట్లాడిన తర్వాత తను తన అరవై రెండేళ్ల సుదీర్ఘ జీవిత ఇంజనీరింగ్ అనుభవాలనూ, కవిగా స్పందననూ ఒకగంట సేపు ఓ యాభైమంది సభికులతో పంచుకున్నప్పటి ఒక చిత్రమైన అనుభవం జ్ఞాపకమొచ్చి...ఆ కవితను వినిపిస్తూ చివరి పాదాలను చదువుతున్నప్పుడు...

'....నాన్న చెబుతుంటాడు
సుఖాలను వెదుక్కుంటూ దేశాల వెంట వలసలు పోయే పక్షులు
కష్టాలు తీరగానే వాటి దేశానికి తిరిగిపోతాయి తప్పకుండా
ఏమి వెదుక్కుంటూ వలసపోయారో బిడ్డా, కనీసం పక్షులవలెనన్నా
మీరు తిరిగొస్తే ఎంత బాగుండు
ఇంతకూ
బతుకు కోసం వలసా? వలస కోసం బతుకా? ఏమిటి బిడ్డా?'

చదవడం పూర్తవుతుండగా...ముందు వరుసలో కూర్చున్న ఓ యువకుడు వెక్కి వెక్కి పడి దుఃఖించడం అందరికీ వినిపించింది.

అందరు ఖిన్నులైపోయారు..అంతా నిశ్శబ్దం

ఆ యువకుడు దస్తీతో కళ్లు తుడుచుకుంటూ బయటకి వెళ్లిపోవడం కనిపించింది.

...అప్పుడు కూడా వర్షమే..ఎడతెగని వర్షం...హాలు బయటా...హాల్లోని మనుషులందరి హృదయాల్లోపలా..ఒకటే వర్షం..

మనిషి మనసులోకి తొంగి చూచుకొని ఎప్పటికప్పుడు ఆత్మావలోకనం చేసుకొని అర్థవంతంగా జీవించడం మరిచిపోతున్నాడు. ఒక డబ్బు సంపాదించే యంత్రంగా మారిపోతున్నాడు. లేకుంటే వాస్తవం కళ్ళముందు విడమరిచి ప్రదర్శించబడ్తున్నప్పుడు దుఃఖం ఒక ఉప్పెనై ఎందుకు ముంచెత్తుతుంది.

మాధవ్ కిటికీలో నుంచి బయటకి చూడ్డం మాని గదిలోకి దృష్టి సారించాడు.

ఎదురుగా సర్ది సిద్ధంగా ఉంచిన తన సూట్‌కేస్, ఒక కాబిన్ బ్యాగ్. అంతా రెడీ. రాత్రి రెండు గంటల పదినిమిషాలకు లుఫ్తాన్సా విమానంలో వాషింగ్‌టన్ డిసి, డల్లెస్ అంతర్జాతీయ విమానకేంద్రం నుండి ఇండియాకు తన తిరుగు ప్రయాణం.

పదిహేను రోజుల ట్రిప్...లోకం దృష్టిలో తను అమెరికాలో నివసిస్తున్న తన కొడుకు భరత్ దగ్గరకి ఒక తండ్రిగా వచ్చి వెళ్తున్నాడు. కానీ తను ఒక ఉద్వేగభరితమైన అరవైరెండేళ్ల జీవితయాత్ర తర్వాత...ఒక ఇంజనీర్‌గా, ఒక రచయితగా, ఒక కవిగా, ఒక వరిష్ఠ భారత పౌరునిగా...ఒక అధ్యయనార్ధం... వాస్తవ వలస వ్యామోహ వ్యవస్థను అతి దగ్గరగా సందర్శించడం కోసం...వచ్చి యాభై రాష్ట్రాలను కలిగి వున్న ఈ విశాల అమెరికా దేశంలో పన్నెండు రాష్ట్రాలను, ఇక్కడి జీవిత వైవిధ్యాలను, మంచినీ చెడునూ పరిశీలించి...

ఏమిలేదిక్కడ...అంతరిక్ష విహార వికటాట్టహాసాల నుండి...డాలర్ కొరడాతో ప్రపంచాన్ని శాసించే విస్తరణకాంక్ష నుండి... పే అండ్ యూజ్.. యూజ్ అండ్ త్రో వరకు...ప్రపంచంలో మనిషెవ్వడైనా మన మార్కెట్‌లో సరుకే...అన్న ఒక అహంకార విజృంభణ...ఏమిలేదిక్కడ?..అన్నీ వున్నాయి.

ఏం వుందిక్కడ? కాగితపు పూల ప్రేమలు..డాలర్ స్పృహ...డాలర్ వేట..సుఖాల వెంట పరుగు..కేంద్రీకృతమైన వ్యక్తి లాలస...తన సుఖం, తన ఆనందం, తన వాంఛ, తనకే చెందిన తన జీవితం...ఇరుగుపొరుగులతో కనీస మానవ సంబంధాలు కూడా లేని బాధల బతుకు...డాలర్ కంపు..తప్పితే ఏంవుందిక్కడ?

చినుకులు...టపటపా కురుస్తున్న చప్పుడు..చినుకులు మనసు నిండా... బయట కార్ పార్కింగ్ షెడ్‌పై...టపటపా...చిత్రమైన ధ్వని...వర్షపు చినుకుల ఈ లయాత్మక ధ్వని ఎంతగానో వెంటాడుతోంది తనను. జీవితంలోని అన్ని కీలక ఘట్టాల్లోనూ వర్షమే..కుండపోత వర్షం...చిక్కని చీకటి...చినుకుల మృదంగ ధ్వని...బీభత్సం...

మాధవ్‌కు తను ఇండియా నుండి వస్తున్నప్పుడు మరోసారి

చదువుకుందామని తెచ్చుకున్న కొన్ని పాత డైరీలు స్ఫురించాయి. మనసు కాలంలోకి రివ్వుమని వెనక్కి రిట్రాక్ చేసుకుంటూ పరుగుత్తుతూండడం ఒక విద్యుదనుభవంగా తెలువడం మొదలైంది. కాబిన్ బ్యాగ్‌ను తెరచి పందొమ్మిది వందల డెబ్బయినాల్గవ సంవత్సరం డైరీని బయటకు తీశాడు.

వేళ్లు పేజీలను చకచకా తిప్పుతున్నాయి. పాతడైరీ పేజీల నుండి ఒక రకమైన ముక్క వాసన గడచిన కాలపు ప్రాచీన పరిమళం వలె..

ఆరోజుకూడా ఇంతే..ఒకటే వర్షం...మూడు రోజులుగా ఎడతెగని ముసురు.. మధ్య మధ్య కుంభవృష్టి... ఎటు చూసినా నీళ్లే...

ఆనాటి రాత్రి...వరంగల్ రైల్వేస్టేషన్‌లో..ఒంటిగంట...ఒకటే ప్లాట్‌ఫాం.. ఒంటరి కర్ర బెంచీపై ఒంటరిగా తను..వర్షపు చినుకుల శబ్దం తప్ప అంతా స్తబ్దత. అంతా చీకటి...ఎదురుగా, దూరంగా ఎర్రని సిగ్నల్ లైట్.

అప్పటికే రావల్సి వుండి ఎప్పుడొస్తుందో తెలియని రైలుకోసం నిరీక్షణ. వర్షం కురుస్తున్న ప్రతి రాత్రీ...ఒక ఆత్మ వివేచన...ఒక లోలోపలికి తొంగిచూపు. ఒక అంతర్మథనం..ఒక వ్యాకులత.

ఆరాత్రీ అంతే...జీవితాన్ని ఒక కీలకమైన స్థానంలో..చౌరస్తాలో నిలబడ్డ మనిషి ఏ దారిని ఎంచుకోవాలో స్పష్టంగా తెలుసుకోలేక తర్జనభర్జన పడుతున్నట్లు తటపటాయించీ తటపటాయించీ ఒక నిర్దుష్టతతో తేరుకుంటున్న రాత్రి...వర్షం కురుస్తున్న రాత్రి.

## 2

### 6 జూన్ 1974.

మనసు చాల ఉద్విగ్నంగా వుంది.

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడైన నాన్న పెంపకంలో చదువుపై ఏర్పడ్డ మమకారం..చదువు అందుబాటులో లేని ఈ సామాజిక స్థితిలో ఉన్నత ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి విజయాన్ని సాధించే ఈ సుదీర్ఘ గతమంతా కళ్లముందు తిరుగుతుంటే ఒక రకమైన భయవిహ్వలతకు లోనవుతున్నాను.

నాన్న నేర్పిందొకటే..నిజాయితీగా ప్రవర్తించడం..అర్ధవంతమైన బాధ్యతాయుతమైన జీవితాన్ని రూపొందించుకోవడం..జీవితానికి సరియైన అర్ధమన్నది సాపేక్షమే కదా..సౌఖ్యవంతమైన జీవితమంటేనే అర్ధవంతమైన జీవితమని సాధారణంగా ప్రతివాడూ తనకు తాను నిర్వచించుకుంటాడు. కానీ నేను అలా అనుకోలేకపోతున్నాను. ఈ ఘర్షణ ఆసియాలోకెల్లా అత్యుత్తమైనదిగా ప్రసిద్ధిగాంచిన రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ, వరంగల్ నుండి నా ఎమ్‌టెక్ డిగ్రీ పూర్తి చేసి బయటకి, నిజమైన జీవితంలోకి ప్రవేశిద్దామనుకుంటున్న ఈ వారం రోజుల నుండి ఇంకా ఎక్కువై..మనసు ఎంతో కల్లోలంగా వుంది.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ కాలేజీలో సీటు సంపాదించుకోవడానికి పడ్డ సుదీర్ఘ శ్రమ, ఎంతో దీక్షగా ఐదేళ్లు కష్టపడి డిగ్రీ పూర్తిచేయడం, మెకానికల్ బ్రాంచ్‌లో టాపర్‌గా రావడం, మళ్లీ పి.జి చేయడానికి ఎంట్రెన్స్, ఫెలోషిప్, పుస్తకాలతో కుస్తీ, అధ్యయనమే ప్రపంచం, లైబ్రరీయే లోకం, గమ్యం పైనే దృష్టి అంతా...ఒక తపస్సు- వెరసి క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రపంచంలో అతి పెద్ద చమురుశుద్ధి కర్మాగారమైన సౌదీఅరేబియా, దహ్రాన్‌లోని అరామ్‌కో కంపెనీలో డిజైన్ ఇంజనీర్‌గా వుద్యోగం రావడం..ఏడాదికి ముప్పదిరెండు వేల అమెరికన్ డాలర్ల జీతం..అంటే ఎంతో పెద్ద ఉద్యోగమన్నమాట..ఆ అవకాశం రాగానే ప్రొఫెసర్లు, తోటి విద్యార్థులు, మూకుమ్మడిగా పైపైబడి ఎంత ఉద్వేగంగా అభినందించారో నన్ను. జీవిత ప్రారంభంలోనే ఎంతో వున్నతస్థాయి వుద్యోగం లభించడం అదృష్టమన్నారు అందరూ.

కానీ అంత వుత్సాహంగా ప్రతిస్పందించలేకపోయాన్నేను.

ఆరోజు రాత్రి నాకు తండ్రీ, గురువూ ఐన నాన్నను సంప్రదించాను మార్గదర్శనం చేయమని. ఆయన ఋషి, విజ్ఞుడు. అన్నింటినీ మించి మంచి స్నేహితుడు.

'ఇరవై ఐదేళ్ల పరిపూర్ణ యవ్వనంలో నిన్ను నువ్వూ, ఈ సమాజాన్నీ దేశాన్నీ సమగ్రంగా విశ్లేషించుకొని నిర్ణయం తీసుకోగలిగిన సమర్థత నీకు అబ్బిందనే నేను భావిస్తున్నాను. ఎవరి జీవితాన్ని వారే నిర్ణయించుకోడం మంచిది. నువ్వే నీ దారిని ఎన్నుకో' అన్నారాయన.

అర్థవంతమైన జీవితం...బాధ్యాతాయుతమైన జీవితం...ఏమిటివి?

సంవత్సరానికి ముప్పదిరెండువేల డాలర్లు సంపాదించడం... సౌకర్యవంతమైన జీవితమౌవుతుంది కానీ అర్థవంతమైన జీవితమవుతుందా?

నేను ఇంత ఉన్నత విద్యావంతునిగా ఎదగడానికి కారణభూతులైన నా తల్లిదండ్రులు, నా కాలేజీ, నా ప్రొఫెసర్లు, ఈ సమాజం, నా విద్య కోసం లక్షలకొద్దీ రూపాయలను వెచ్చించిన నా దేశం...వీళ్ల సంగతేమిటి? ఒక పౌరునిగా వీళ్లందరి పట్ల నా బాధ్యత లేదా? వీళ్లందరి సహకారం లేకుంటే నేనిలా తయారయ్యేవాడిని కాదుగదా...వీళ్లందరి ఋణం తీర్చుకోవలసిన బాధ్యత నాకు లేదా? నన్ను వీళ్లందరూ తయారుచేసినట్టుగానే నేను కూడా భావితరాల్ని తయారు చేయవలసిన ధర్మం నాపై లేదా..కేవలం నా సుఖాన్నీ, సౌఖ్యాన్నీ, ఆదాయాన్నీ చూసుకొని సామాజిక బాధ్యతలనూ, ఈ దేశం పట్ల నా కర్తవ్యాన్ని విస్మరించి నా దారిన నేను ఎదిగి ఎగిరిపోవడం సరియైందేనా...?

...ఘర్షణ...ఘర్షణ...రేయింబవళ్లు నిరంతర ఘర్షణ.

ఇది నాకు మాత్రమే సంబంధించిన నా అత్యంత ప్రధానమైన జీవిత

సందిగ్ధత. ఏ నిర్ణయం తీసుకున్నా, సరియైంది కాకపోయినా, తప్పుడు నిర్ణయం మాత్రం తీసుకోవద్దని ఎంత మధనపడ్డానో...

చివరికి ఈ రోజు ఉదయం సరైన నిర్ణయం తీసుకొన్నాను. వుద్యోగం, సంపాదన నెపంతో ఏ దేశానికో పారిపోవడం...నిస్సందేహంగా నా వాళ్లకు ద్రోహం చేయడమే అవుతుంది. నేను సుఖంగా వుండడానికి నాకు ఇంత ఆదాయం అవసరం లేదు. నేను వలసపోవడం అంటే ఒక నిపుణుడైన ఇంజనీర్‌గా నా సేవలను ఈ దేశానికి అందించకుండా మోసం చేయడమే. ఈ దేశం పట్ల నాకు పౌరునిగా కొన్ని బాధ్యతలున్నాయి. వాటిని నేను విస్మరించలేను.

అందుకే నిర్ణయం తీసుకొన్నాను.

ద్రహ్రాన్‌లోని ఆరామ్‌కో కంపెనీ వుద్యోగంలో చేరడంలేదు. ఈ రోజే ఈ సమాజానికీ, యువతకూ మార్గదర్శనం చేయగలిగే అవకాశమున్న ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా చేరేందుకు బయల్దేరుతున్నాను. ఈ నిర్ణయం కొందరికి విపరీతంగా...మరికొందరికి తెలివితక్కువగా అనిపించవచ్చు. కానీ నాకు స్పష్టంగా తెలుస్తోంది నా నిర్ణయం సరియైందేనని.

వర్షం తగ్గింది.

ఎదురుగా ఇప్పటిదాకా వెలిగిన ఎర్రలైటు మారి పచ్చలైటు వచ్చింది.

అదిగో..నేను ఎక్కవలసిన రైలు వస్తోంది.

## 3

### 9 జులై 1998.

ఒక తండ్రిగా భరత్‌ను మా నాన్నవలె సరైన పంథాలోనే పెంచాలనీ, చదివించాలనీ ప్రయత్నించాను. చిన్నప్పటినుంచీ భరత్ చదువులో ఎంతో చురుకైనవాడు. ఎస్సెస్సీలో జిల్లా ర్యాంక్ సంపాదించాడు. ఎమ్‌సెట్‌లో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంక్ సంపాదించడం, తర్వాత ఐఐటి బాంబే నుండి డిగ్రీ, గేట్‌లో దేశంలోనే మూడవ ర్యాంక్‌తో ఐఐటి ఖరగ్‌పూర్ నుంచి ఎమ్‌టెక్.. ఇవన్నీ విద్యావిషయంగా భరత్ సాధించిన విజయాలే. ఐతే జీవిత లక్ష్యాల విషయంగా నాకూ, భరత్‌కూ, అసలు పోలికలే లేవు. ఎంతసేపూ తను జీవించడం..తన ప్రపంచంలో తను సుఖంగా వుండడం..ఇవే వాడికి కావాలి.

ఈ మార్పును అతను ఈ తరంలో వచ్చిన ఒక పరిణామంగా చెబుతాడు. దీన్ని గ్లోబల్ థింకింగ్ అంటాడు. తెలివిగలవాళ్లకు ఈదేశంలో ఎదిగే అవకాశాలు లేనప్పుడు అవకాశాలున్నచోటికి వెళ్తే తప్పేమిటని వాదిస్తాడు. ఒక్కో ఐఐటి ఒక్కో ఇంజనీర్‌ను తయారుచేసేందుకు ఖర్చుపెడ్తున్న దాదాపు ఇరవై రెండు లక్షల రూపాయలు విషయమేమిటని అడిగితే...కష్టపడి తెలివిగల వానిగా ఎదిగినందుకు వాళ్లపట్ల ఈ దేశం బాధ్యత అంటాడు. మరి అదే దేశం పట్ల

మీబాధ్యత ఏమిటి?

జవాబు వుండదు.

ఈ ఐఐటిలను ఈ దేశ ప్రజల కష్టార్జితంతో, సొమ్ముతో నడుపుతున్నప్పుడు ఐఐటిలు వెలువరిస్తున్న తొంభైశాతం మంది విదేశాలలోనే స్థిరపడుతున్న నేపథ్యంలో స్థూలంగా జరుగుతున్నదీ దేశప్రజల పట్ల ద్రోహం కాదా. ఇక్కడ ఎందరో విద్యావంతులు సమాజం కోసం అవసరమైతే ప్రాణాలర్పిస్తుంటే మరోవైపు కొందరు ఐఐటి నిచ్చెనల ద్వారా వైకుంఠపాళీ పరమపదసోపాన స్థాయి పొందడం సరియైందేనా...

నిన్న భరత్ నా గదిలోకి వచ్చినప్పుడు జరిగిన సంభాషణ ఇలా వుంది.

'నాన్న! నాకు క్యాంపస్ సెలక్షన్‌లో మైక్రోసాఫ్ట్‌లో ఆఫర్ వచ్చింది. వీసాగీసా అన్నీ వాళ్లే ఏర్పాటు చేశారు. వన్‌ట్వంటీ కె జీతం. జీవితం కంఫర్ట్‌బుల్‌గా వుంటుంది. ఎసి అపార్ట్‌మెంట్, ఎసి కారు, ఆల్ పెర్క్స్...అంటే..నా డ్రీమ్ సక్సెస్ అయింది. రాబోయే ఆరవతేదీ రాత్రి ఒంటిగంట ఫ్లైట్‌కు ఔట్. న్యూయార్క్‌లో పోస్టింగ్. బై డాడ్..!'

'భరత్ నువ్వు ఇక్కడే ఈ దేశంలోనే ఏదైనా కంపెనీలో పనిచేస్తే ఎంతిస్తారు నీకు?'

'ఆ...ఎంత. ముష్టి ఓ ట్వంటీ ఫోర్ ల్యాక్ పర్ ఆనమ్ ఇస్తారు.'

'అంటే...నెలకు రెండు లక్షలు...చాలవా అవి నీకు. ఈ డబ్బు పిచ్చి ఎందుకురా? వాట్ ఎబౌట్ దిస్ కంట్రీ? అందరూ నీలాగే ఈ దేశాన్ని విడిచి వెళ్తే ఇక్కడి భవిష్యత్తు సంగతి ఏమిటి? భరత్...!'

'డాడ్...ట్రాష్ ఇదంతా...చెప్పాను గదా...బి ఎ గ్లోబల్ మాన్'

భరత్ వెళ్లిపోయాడు రూం నుండి నా జవాబు వినకుండానే...

....అప్పుడు చూశాను. బయట ఒకటే వర్షం. భీకరమైన వర్షం. తుఫానును తలపించే జడివాన..బయటా...లోపలా కూడా...

ఐతే ఒకటి మాత్రం స్పష్టపడింది. భరత్‌కు లాంగ్ టర్మ్ ట్రీట్‌మెంట్ జరగాలి.

## 4

'నాన్నా...బయల్దేరామా'

వులిక్కిపడ్డాడు మాధవ్. ఎదురుగా భరత్ లగేజ్ సూట్‌కేసును కారు దగ్గరకు రోల్ చేస్తున్నాడు.

బయట వర్షం కురుస్తునే వుంది.

చేతిలోని డైరీలను కాబిన్ బ్యాగ్‌లో పెట్టి...మాధవ్ టకటకా బయటకి గారేజ్‌లోకి వచ్చాడు.

'మీరు వెనుక సీట్లో కూర్చోండి'

కూర్చున్నాడు...ముందు పక్క సీట్లో కాబిన్ బ్యాగ్ వుంది.

ఉండి...ఉండి...ఆకాశం ఫెళఫెళమని ఒక్కసారిగా ఉరిమింది. ఎక్కడో పిడుగుపడినట్టుంది.

కారు బయలుదేరింది...బ్రూక్‌ఫీల్డ్...జర్మన్‌టౌన్..రోడ్లు దాదాపు నిర్మానుష్యం. టైం పదకొండు గంటల రెండు నిమిషాలు.

కారు ఇంటర్ స్టేట్ 27 ఎక్కిన తర్వాత,

'మనం నలభై నిమిషాల్లో డల్లస్ ఎయిర్‌పోర్టులో ఉంటాం. ఈ లోగా ఈ కాగితం చదవండి. అని ఒక కవర్ అందించి మధ్యలో వున్న ల్యాంప్ స్విచాన్ చేశాడు భరత్.

మాధవ్ కవర్ అందుకుని విప్పి చదవడం ప్రారంభించాడు.

బయట ఆగకుండా వర్షం కురుస్తునే వుంది.

నాన్నా,

తండ్రిని 'నాన్నా' అని పిలవమని మీరు, 'డాడీ' అని పిలుస్తానని నేను... అక్కడి నుండి ప్రారంభమైంది మన మధ్య స్పర్థ.

జీవితాన్ని అర్థవంతంగా, బాధ్యతాయుతంగా జీవించాలని మీరు,

జీవితాన్ని 'అర్థ'వంతంగా, బాధ్యతారాహిత్యంతో జీవించాలని నేను...

అమెరికా వచ్చిననాటి నుంచి గత ఎనిమిదేళ్లుగా ఇక్కడి జీవితాన్ని ఇక్కడి ఇతరుల జీవితాన్ని, అక్కడి భారతదేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక స్థితిగతుల్ని ఎంతో సూక్ష్మంగా అధ్యయనం చేస్తూ వస్తున్నాను.

ఇక్కడున్న ప్రతి ఇండియన్ డబ్బుకోసం వలస వచ్చినవాడే. అందరికీ డాలర్లే కావాలి. అతి తక్కువ సమయంలో అతి ఎక్కువ డబ్బును సంపాదించాలన్నదే దాదాపు అందరి ధ్యాస. ప్రతివారికీ ఒక ప్రపంచం. భార్యా, పిల్లలు, తను, తన బ్యాంక్ బ్యాలెన్స్. ఎప్పుడైనా కొద్ది టైం దొరికితే రిలాక్స్ అండ్ ఎంజాయ్. కొందరైతే కల్చర్ ప్రొటెక్టర్స్‌గా సంఘాలు పెట్టి చందాలు వసూలు చేసి అందినంత తిని, ఖర్చుపెట్టి సినిమావాళ్లతో, స్వాములతో ఫోటోలు దిగి పబ్బం గడుపుకుంటూ పెద్దమనుషులుగా చెలామణి అంతా ఒక ఫార్స్. కాకిబంగారం బతుకు. అప్పుడప్పుడు ఇండియాలో కొన్ని గిఫ్ట్‌లతో ముసలి తల్లిదండ్రులను, బంధువులను మభ్యపెట్టి ఫోజుల కొట్టి...అంతా ఆత్మవంచన... దగా...

సెన్సాఫ్ పొసెసివిటీ అని ఒకటుంది కదా..ఎంత గొప్ప వస్తువైనా, జీవితమైనా, రంభలాంటి పెళ్లామైనా అది పూర్తిగా తనదైన తర్వాత...ఇక దానిపై ఆసక్తి నశిస్తుంది. క్రమంగా ఏవగింపు పుడ్తుంది.

ఆ కోణంలో జీవితాన్ని అధ్యయనం చేస్తూ వస్తున్నాను.

ఒకప్పుడు భారతదేశం వెళ్లాలి..వెళ్లి ఏదైనా చేయాలి...చేసి ఋణం తీర్చుకోవాలి...ఇలా తపన..కానీ ఇప్పుడక్కడ ఏమి మిగిలింది నాన్నా.

ఎక్కడ చూచినా విశృంఖలత్వంగా మారుతున్న స్వాతంత్ర్యం. మితిమీరిపోతున్న స్వేచ్ఛ. విచ్చలవిడితనం..నైతిక విలువల సంపూర్ణ పతనం

కోట్లకు కోట్లు ప్రైవేటు బ్యాంక్ నుండి రుణాన్ని తీసుకొని ఎగవేసిన వాళ్లు కేంద్రమంత్రులవుతారు. ఒక్కళ్లూ కిమ్మనరు. బ్యాంకులు దివాళా తీసి కామన్ డిపాజిటర్స్ ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఒక్క రాజకీయ పార్టీవాడు చివరికి నక్సలైట్లు కూడా ఏ ఎగవేతదారున్నీ ఏమీ అనవు. నిండు పార్లమెంట్‌లో గురుదాస్ గుప్తా మూడువందల కోట్ల రూపాయల స్కాంను రుజువుల్తోసహా బయటపెడ్తే ఎవడూ చర్య తీసుకోడు. ప్రజలు మా వెనుకున్నారని అడవుల్లో నుండి అరుస్తున్న వాళ్లు ఆ అడవుల్లో వుండే గిరిజనుల్ని ఊచకోత కోస్తారు. ఉగ్రవాదానికీ, ఉద్యమవాదానికి తేడాలేకుండా హింసను వికృతచేష్టగా ఆచరిస్తున్న వాళ్లను సమర్థిస్తూ కొందరు హింసావాదులు మేధావులుగా చెలామణి ఔతూ మీడియాలో ప్రతినిత్యం కనిపిస్తారు. నల్లమల విదారకంగా కనపడ్డవానికి ఎర్రబోరు రోదన వినపడదు. ఒక బ్యాంకు మోసగాడు విప్పిన చిట్టాలో ఇద్దరు డిజిపీలు బయటపడ్డారు. ఒక సినిమా మదాంధుడు తాగి రోడ్డు పక్కన పడుకున్న బిచ్చగాళ్లపై కారు నడిపి చంపి మళ్లీ మామూలుగా బెయిల్‌పై విడుదలై సినిమా తెరపై చిందులేస్తాడు. అమెరికా దేశం మొత్తంమీద రెండువందల యాభై ఇంజనీరింగ్ కాలేజీలు వుంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఆరు వందల నలభై ఇంజనీరింగ్ కాలేజీలను సారాకాంట్రాక్టర్లు నడుపుతారు. ఒక చత్తీస్‌ఘడ్‌లో నూటపద్నాలుగు యూనివర్సిటీలున్నాయి. తమ పిల్లలను సురక్షితంగా అమెరికాలో ప్రతిష్ఠించి ప్రతినెలా డాలర్లను భుజిస్తూ వేదికలెక్కి ప్రపంచీకరణకు వ్యతిరేకంగా అరిచే మేధావులు, సూడో రచయితలు, కవులు వుంటారు ప్రతి పట్టణంలో... ఎయిర్‌ఫోర్స్‌లో లష్కరే తోయిబా చేరుతుంది. వందేమాతర గీతం ఆలపించే పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని ముగ్గురు మతనాయకులు ఫత్వా జారీచేస్తారు. సినిమాల్లో ఎస్సెస్సీ పిల్లలు ప్రేమించుకుని లేచిపొమ్మని ప్రబోధాలు కనిపిస్తాయి. యువత సెల్‌ఫోన్ బూతు ఎస్సెమ్మెస్‌ల్లో సమాధైపోతోంది. రాజధాని నగరమంతా ఐటి విటులతో, రాజకీయ మాఫియాలకు భూములను కట్టబెడ్తూ ఊళ్లకు ఊళ్లనే అనాధలను చేస్తుంది. రాజకీయాలలో ఇక్కడ స్నేహపూర్వక పోటీ. అక్కడ శత్రుపూర్వక కౌగిలింత...తల చెల్లెలు, మిగతా శరీరం మరదలు.

ఏమిటి..ఏమిటిదంతా..ఏమి జరుగుతోంది? ఎక్కడికి పోతోంది సమాజ వ్యవస్థ. బహుముఖంగా చెడిపోయి భ్రష్టుపట్టిపోతోంది.

నాన్నా...గత పదిరోజులుగా ఇక్కడ అమెరికాలోని వివిధ వేదికలపై మీరు చేసిన పలు వేదనాభరితమైన ప్రసంగాలను విన్నాను.

కానీ...

ఈ సైకిల్‌లాంటి వ్యవస్థకు...చైన్ పోయింది. సీట్ పోయింది. వీల్‌పోయింది..హాండిల్ పోయింది...లైట్‌పోయింది.. పెడల్ పోయింది..బెల్ పోయింది...సిస్టమ్ ఈజ్ ఇర్రిపేరబుల్.

వ్యవస్థనే మార్చాలిక.

ఈ స్థితిలో పూర్తిగా అభద్రత నిండి విచ్చలవిడితనంతో జోగుతున్న భారత వర్తమాన సమాజంలో ఇప్పుడు మాలాంటి వాళ్లు చేయగలిగిందేమిటి? దీనికి మరమ్మత్తులు చేయడం సాధ్యమేనా? మీరు నాకు తండ్రి మాత్రమే కాదు, గురువుకూడా కదా...

అంతా అపస్మారకంగా వుంది నాన్నా...మార్గనిర్దేశనం చేయండి

-భరత్

బయట వర్షం జోరు ఎక్కువైంది.

మాధవ్ వుత్తరం చదవడం పూర్తి చేసి జేబులో పెట్టుకున్నాడు. కారు డల్లస్ ఎయిర్‌పోర్టు పార్కింగ్ ఫ్లోర్‌లోకి ప్రవేశించింది.

## 5

చెకింగ్ అయిపోయి బోర్డింగ్ పాస్ కూడా ఇచ్చిన తర్వాత మాధవ్ బోర్డింగ్ లాంజ్‌లోకి ప్రవేశించే ముందు భరత్ నుంచి వీడ్కోలు తీసుకుంటూ,

'భరత్ కొన్ని వ్యాధులు షార్ట్‌టైం చికిత్సకు నయమైపోతాయి. కొన్ని వ్యాధులకి లాంగ్‌టర్మ్ చికిత్స అనివార్యమౌతుంది. ఈ కవర్‌ను నువ్వే వుంచుకో. జవాబు దాన్లోనే వుంది. వెదుకు...అన్వేషించు' అని అడుగులు ముందుకు వేశాడు.

భరత్ విమానం దిక్కు నడచివెళ్తున్న తండ్రిని ఒక కొత్త చూపుతో చూస్తుండగా అప్పటినుండీ వినపడని వర్షం హోరు మళ్లీ వినబడ్డం మొదలైంది.

వర్షం ఇంత భయంకరంగా వుంటుందా? అనిపించిందతనికి.

తండ్రి కనపడకుండా పూర్తిగా నిష్క్రమించిన తర్వాత మళ్లీ చేతిలోని తను తండ్రికి రాసిన కవర్ విప్పాడు. అన్వేషిస్తున్నాడు....పరిష్కారం కోసం..

చదివాడు..ఒకసారి..రెండు సార్లు...పలుసార్లు...చివరికి దొరికింది జవాబు.

'సిస్టమ్ ఈజ్ ఇర్రిపేరబుల్'

వ్యవస్థనే మార్చాలిక

అక్షరాలు స్పష్టంగా, అర్థవంతంగా ప్రజ్వలిస్తూ కనిపిస్తున్నాయి.

వర్షం...వర్షం...

బయటా...లోపలా..భీకరమైన వర్షం...

'నవ్య' వారపత్రిక తేది : 13-09-2006
'తెలంగాణ కథ' - 2006